క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రత్తిపాడు: ఎలుకల మందు తిన్న వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం.. ప్రత్తిపాడు మండలం రావిపాటివారిపాలెం గ్రామానికి చెందిన వాసిమళ్ల అశోక్ (33) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన అశోక్ ఈ నెల 8వ తేదీన పూటుగా తాగిన మైకంలో మద్యంలో ఎలుకల మందు కలుపుకొని తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు అశోక్ తండ్రి వాసిమళ్ల శామ్యూల్ జాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ డి. రవీంద్రబాబు తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ప్రత్తిపాడు: పదో తరగతి విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై స్థానిక పోలీస్ స్టేషనులో కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ప్రత్తిపాడు మండలానికి చెందిన విద్యార్థిని (15) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతుంది. ప్రస్తుతం పాఠశాలకు సంక్రాంతి సెలవులు కావడంతో ఇంటి వద్దనే ఉంటుంది. ఈ నెల 9వ తేదీన తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లారు. సాయంత్రం పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చేటప్పటికి ఇంట్లో విద్యార్థిని కనిపించలేదు. చుట్టుపక్కల ప్రదేశాలతో పాటు బంధువుల ఇళ్లలో వెతికినప్పటికీ ఫలితం కనిపించలేదు. దీంతో బుధవారం బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ డి.రవీంద్రబాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

13న ముగ్గుల పోటీలు

గుంటూరు రూరల్: నల్లపాడు చల్లావారిపాలెం గ్రామదేవత శ్రీ ఘంటాలమ్మ, పుట్టలమ్మతల్లి ఆలయ సంక్రాంతి మహోత్సవాల్లో భాగంగా ఈనెల 13వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు జిల్లాస్థాయి ముగ్గుల పోటీలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఇంటూరి అంజిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏటా ఆలయ ప్రాంగణంలో నిర్వహించే సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా ఈ ముగ్గుల పోటీలను నిర్వహించటం జరుగుతుందన్నారు.

నేడు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు

ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలంలో రూ.43.60 లక్షల వ్యయంతో నిర్మించిన ఐలవరం-1 సచివాలయం, రూ.28.80 లక్షల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను గురువారం ప్రారంభించనున్నట్లు సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు బుధవారం తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. గ్రామంలో రూ.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న త్రీఫేజ్ విద్యుత్ పనులను కూడా ప్రారంభించనున్నట్లు చెప్పారు.

గ్రామాల్లో ఫైలేరియా సర్వే

పిట్టలవానిపాలెం: చందోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వైద్య సిబ్బంది మండలంలోని చందోలు, ఖాజీపాలెం గ్రామాల పరిధిలో ఫైలేరియా సర్వేను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ యు.నరసింహారావు మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు సాయంత్రం 7.30 గంటల నుంచి 10.30 గంటల వరకు చందోలు, ఖాజీపాలెం గ్రామాలలో ఫైలేరియా సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సర్వేలో సూపర్‌వైజర్‌లు నాగేశ్వరరావు, ఎస్‌కె.జానీ, శ్రీనివాసయాదవ్, హేమ సుందరరావు, ఏఎన్ఎంలు, ఆశాలు ఉన్నారు.

విద్యుత్తు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు



కర్లపాలెం(పిట్టలవానిపాలెం): విద్యుత్త చౌర్యం చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని బాపట్ల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గువ్వల ఆంజనేయులు హెచ్చరించారు. కర్లపాలెం మండలంలోని పలు గ్రామాలలో విద్యుత్ సర్వీసుల ఆకస్మిక తనిఖీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్లపాలెం మండలంలో మొత్తం 3,300 విద్యుత్ సర్వీసులను తనిఖీ చేశామని తెలిపారు. అక్రమ విద్యుత్తు వాడకాలు చేస్తున్న వారిపై 97 కేసులు నమోదు చేసి రూ.4.54 లక్షలు అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ బి.హరిప్రసాద్, చెరుకుపల్లి, పొన్నూరు ఏడీఈలు, స్థానిక ఏఈ కుమార్, డివిజన్‌లోని ఏఈలు పాల్గొన్నారు.

సీసీ డ్రైన్‌కు శంకుస్థాపన

తెనాలిఅర్బన్: 40వ వార్డు వెలువోలు వారి వీధిలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ డ్రైన్‌కు మున్సిపల్ వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 40వ వార్డు అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' పోటీలు ప్రారంభం

- తొలిరోజు హోరాహోరీగా తలపడిన జట్లు
- పోటీల్లో పాల్గొన్న గ్రామీణ క్రీడాకారులు



పోటీల్లో తలపడుతున్న బాలికలు

ప్రత్తిపాడు: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి ఆటల పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని షటిల్ ఇండోర్ స్టేడియంలో, నడింపాలెంలోని నరేంద్ర అకాడమీలో, గొట్టిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మొదటి రోజు బాలుర, బాలికల విభాగాల్లో షటిల్ పోటీలను నిర్వహించారు. మండలంలోని పదమూడు సచివాలయాల నుంచి పదమూడు టీంలు పోటీల్లో పాల్గొన్నాయి. ఆయా పాఠశాలల పీడీలు, పీఈటీల సమక్షంలో క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. ప్రత్యర్థిపై ఆధిపత్యం సాధించేందుకు అటు బాలికలు, ఇటు బాలురు పోటాపోటీగా తలపడ్డారు. బాలికల విభాగంలో పాతమల్లాయపాలెం గ్రామానికి చెందిన చాగంటి ధరణి, మెట్టు భవానిల టీం జయభేరీ మోగించి విజయం సాధించింది. అదేవిధంగా బాలుర విభాగంలో కోయవారిపాలెంకు చెందిన వెంకటేశ్వరరావు, బాలకృష్ణల టీం విజయం సాధించింది.

నేడు వాలీబాల్ పోటీలు

ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా 11వ తేదీన వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నట్లు ప్రత్తిపాడు హైస్కూల్ పీడీ డేవిడ్ రాజ్‌కుమార్ తెలిపారు. 12వ తేదీన క్రికెట్ పోటీలు, 17న కబడ్డీ, 18న ఖోఖో పోటీలు జరగనున్నాయని తెలిపారు. ఆయా సచివాలయాల నుంచి ఎంపికైన టీంలు మండల స్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. మండల స్థాయిలో విజేతలకు నియోజకవర్గ స్థాయిలో పోటీలు జరిపి విజేతలను నిర్ణయించడం జరుగుతుందని డేవిడ్ తెలిపారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న తుమ్మల సుబ్బారావు

ఆటలతో మనోవికాసం

కాకుమాను: ఆటలతో ఆనందంతో పాటు ఆరోగ్యం అభివృద్ధి చెందుతుందని ప్రతి విద్యార్థి ప్రాథమిక స్థాయి నుంచే ఆటల పట్ల ఆసక్తి పెంచుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ, ఎంపీపీలు పాల్గొని ఆటల పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ పసుపులేటి శివకుమారి, తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఎంపీడీవో రామకృష్ణ, ఎంఈవో-2 విజయ్ భాస్కర్, హెచ్‌ఎం సత్యం, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



షటిల్ బాలికల విభాగంలో విన్నర్‌గా నిలిచిన పాతమల్లాయపాలెం జట్టు

గ్రామీణ క్రీడాకారులకు ఆడుదాం ఆంధ్రా వరం

గుంటూరు రూరల్: యువతలోని క్రీడా నైపుణ్యతలను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడల ద్వారా పెద్దపీట వేస్తుందని రూరల్ మండలం జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు తెలిపారు. బుధవారం మండలంలోని వెంగళాయపాలెం గ్రౌండ్‌లో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడా జెండాను ఎగురవేసి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. షటిల్ బ్యాడ్మింటన్ ఆడి ఆటలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆదినారాయణ, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, మండల స్పెషల్ ఆఫీసర్ వజ్రశ్రీ, సచివాలయం ఉద్యోగులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

జీఈసీలో వేడుకగా సంక్రాంతి సంబరాలు



కళాశాలలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు



సంప్రదాయ ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

- అలరించిన బొమ్మల కొలువు, రంగవల్లులు
- సంప్రదాయ వేషధారణలో ఆకట్టుకున్న విద్యార్థులు

ప్రత్తిపాడు: తెలుగుదనం తొణికిసలాడేలా.. సంప్రదాయం ఉట్టిపడేలా మండల పరిధిలోని గుంటూరు ఇంజినీరింగ్ కళాశాలలో సంక్రాంతి వేడుకలు అట్టహాసంగా జరిగాయి. డూడూ బసవన్న సయ్యాటలు, హరిదాసుల కీర్తనలు, పట్టుపరికిణీలో యువతులు, పట్టుపంచెల్లో యువకులు, రంగురంగుల రంగవల్లులు, గాలిపటాలు, బొమ్మల కొలువులు, ప్రభలు, చెరకు గెడలతో స్వాగత ద్వారాలు, గోళీలాటలతో కళాశాల ప్రాంగణం వీనుల విందుగా మారింది. కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు చిన్నారులను భోగిపళ్లు పోసి వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ కోయి శేఖర్, డైరెక్టర్ జి. సాంబశివరావు, ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామకోటయ్య తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు భోగిపళ్లు పోస్తున్న కళాశాల చైర్మన్ సుబ్బారావు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



ప్రత్తిపాడు: హైవేపై కుక్కను తప్పించబోయి ద్విచక్రవాహనదారుడు దుర్మరణం పాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం రేవేంద్రపాడుకు చెందిన కూరపాటి భాగ్యచక్రవర్తి (51) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 9వ తేదీన బాపట్ల జిల్లా మార్టూరు గ్రామంలో చనిపోయిన తన బంధువుల కార్యక్రమానికి వెళ్లాడు. కార్యక్రమం అనంతరం తిరిగి తన ద్విచక్రవాహనంపై తన స్నేహితుడు పవన్‌తో కలిసి ఇంటికి బయల్దేరాడు. ఈ క్రమంలో ప్రత్తిపాడు మండలం యనమదల గ్రామం సమీపంలో పదహారవ నంబరు జాతీయ రహదారిపై ఒక్కసారిగా కుక్క అడ్డు వచ్చింది. దీంతో కుక్కను తప్పించబోతున్న సమయంలో బైక్ అదుపుతప్పి భాగ్యచక్రవర్తి కిందపడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా బైక్ వెనుక ఉన్న మరొక వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుని కుమారుడు కూరపాటి ప్రదీప్ చంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్రత్తిపాడు ఎస్‌ఐ డి. రవీంద్రబాబు తెలిపారు.

ఎండీయూ వాహనాల పరిశీలన



పెదకాకాని: ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేయడంలో ఎటువంటి అవకతవకలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పి రత్నం అన్నారు. పెదకాకాని మండలంలోని పెదకాకాని, అగతవరప్పాడు గ్రామాలలో ఇంటింటికీ తిరిగి రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనం ద్వారా సరుకుల పంపిణీ తీరును ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ స్వాతితో కలసి పరిశీలించారు. వాహనంలోని సరుకులను తనిఖీ చేశారు. వాహనం ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న వారందరూ ప్రతి ఇంటికీ వెళ్లి సరుకులు తప్పనిసరిగా అందజేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధలను పాటించాలన్నారు. ఎవరైనా రేషన్ సరుకులు పొందని వారుంటే అలాంటి వారి కోసం ప్రతి నెల 17వ తేదీన సచివాలయం వద్ద ఎండీయూ వాహనం ఏర్పాటు చేసి రేషన్ పంపిణీ చేయాలన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల ఒక గంట సమ్మె

తెనాలి: ఎల్ఐసీ ఉద్యోగుల జాయింట్ ఫోరం పిలుపు ప్రకారం తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ బుధవారం దేశవ్యాప్తంగా చేపట్టిన ఒక గంట సమ్మెలో తెనాలి ఎల్ఐసీ ఉద్యోగులు పాల్గొన్నారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి గంటసేపు సమ్మె చేశారు. ఎల్ఐసీ ఉద్యోగులకు వేతన సవరణ చర్చలు ప్రారంభించాలని, నూతన పింఛను విధానం రద్దుచేసి, పాత పింఛను విధానం అమలుచేయాలని, ఎల్ఐసీలో అన్ని కేడర్లలో రిక్రూట్‌మెంట్ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్-మచిలీపట్నం డివిజన్ ఉపాధ్యక్షుడు వేదాంతం ఫణీంద్ర మాట్లాడుతూ ఎల్ఐసీ ఉద్యోగులకు 2022 ఆగస్టు ఒకటి నుంచి వేతన సవరణ జరగాలని, గడువుదాటి 17 నెలలైనా యాజమాన్యం చర్చలకు పిలవలేదన్నారు. ఎల్ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్, తెనాలి శాఖ నాయకులు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పింఛను అనేది ఉద్యోగుల హక్కుగా 1982లోనే సుప్రీంకోర్టు తీర్పునిచ్చినట్టు చెప్పారు. తెనాలి శాఖ సీనియర్ మేనేజరు గౌతమ భీమారావు మాట్లాడుతూ పాలసీదారులకు మెరుగైన సేవలను అందించటానికి ఎల్ఐసీలో అన్ని కేటగిరీల్లో రిక్రూట్‌మెంట్ చేపట్టాలన్నారు. యూనియన్, తెనాలి శాఖ కార్యదర్శి దేవరకొండ వెంకటసుబ్బారావు, అధ్యక్షుడు పిసుపాటి సుధాకర్, ఎల్ఐసీ నాయకులు కోళ్లపూడి రాజు, ఎల్ఐసీ ఆఫీసర్స్ యూనియన్ నాయకులు సీహెచ్ రమేష్, జలవాది శ్రీనివాస్, ఉద్యోగులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ


కోన ట్రస్టు ఆధ్వర్యంలో అందజేత



దుప్పట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

పిట్టలవానిపాలెం: బాపట్ల నియోజకవర్గంలోని ప్రజానీకానికి సహాయం చేయడంలో కోన ఛారిటబుల్ ట్రస్టు ఎల్లప్పుడూ ముందుంటుందని బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి అన్నారు. మండలంలోని కోమలి గ్రామంలో కోన ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సామాజిక పింఛన్‌దారులకు దుప్పట్లు అందజేశారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి కుల, మత, వర్గ, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేదవాడికి కష్టం వచ్చిందంటే కోన ఛారిటబుల్ ట్రస్టు ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. బాపట్లను జిల్లాగా చేసుకున్నామని జిల్లాను అభివృద్ధి చేసుకోవాలంటే మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయటంతో పాటు బాపట్ల శాసన సభ్యునిగా మూడో సారి తనను ఎన్నుకోవాలని కోరారు. సచివాలయ పరిధిలోని 128 మంది పింఛన్ దారులకు దుప్పట్లు అందజేశారు. తక్కువ సమయంలో ఈ సభా ప్రాంగణాన్ని అద్భుతంగా ఏర్పాటు చేసిన గ్రామ సర్పంచ్ శ్యామల నాగిరెడ్డిని అభినందించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలాశ్రీనివాసరెడ్డి, గ్రామ సర్పంచ్ శ్యామల నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ కృపానందం, సంగుపాలెం ఎంపీటీసీ సభ్యులు గంగయ్య, బాపట్ల జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు యేట్ర అశ్వినిరెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కె.దేవేంద్రరాజు, మండే విజయ్‌కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ హఠాన్మరణం



గడవర్తి సుబ్బయ్య (ఫైల్)

తెనాలి: మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గడవర్తి సుబ్బయ్య (63) హఠాన్మరణం చెందారు. స్థానిక గంగానమ్మపేటలోని స్వగృహంలో బుధవారం మధ్యాహ్నం భోజనం అనంతరం విశ్రాంతి తీసుకుంటూ ఉండగా, నాలుగు గంటల ప్రాంతంలో గుండెపోటు వచ్చింది. కుటుంబసభ్యులు హుటాహుటిన సమీపంలోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతిచెందినట్టు ధ్రువీకరించారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. గడవర్తి సుబ్బయ్య తెనాలి మున్సిపల్ కౌన్సిలర్‌గా, మున్సిపల్ వైస్ చైర్మన్‌గా పనిచేశారు. ఆయన భార్య శ్రీదేవి కూడా కౌన్సిలర్‌గా చేశారు. ఆ తర్వాత తెనాలి వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్‌గానూ సుబ్బయ్య బాధ్యతలు నిర్వర్తించారు. మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, టీడీపీ నాయకులు మహమ్మద్ ఖుద్దూస్, కాకుమాను కనకరాంబాబు, పలువురు మాజీ కౌన్సిలర్లు, యాదవ సంఘీయులు సుబ్బయ్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియలు గురువారం నిర్వహించనున్నట్టు కుటుంబసభ్యులు తెలియజేశారు.

ఎమ్మెల్యే శివకుమార్ సంతాపం..

గడవర్తి సుబ్బయ్య హఠాన్మరణంపై ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. రాజకీయాల్లో సుబ్బయ్యతో తన అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం లోకకళ్యాణార్థం మహాయజ్ఞం నిర్వహిస్తున్న కారణంగా వ్యక్తిగతంగా హాజరుకాలేకపోతున్నట్టు చెప్పారు. యాగం ముగిసిన తర్వాత కుటుంబసభ్యులను పరామర్శిస్తానని చెప్పారు.

ప్యారడైజ్ గృహ సముదాయంలో గొబ్బెమ్మలు



తెనాలి టౌన్: ధనుర్మాసం సందర్భంగా గంగానమ్మపేటలోని ప్యారడైజ్ గృహ సముదాయంలో ఆధ్యాత్మిక సేవకురాలు, భక్తి కీర్తన గాయని శారదా చలపతి ఆధ్వర్యంలో బుధవారం గొబ్బిళ్ల ఉత్సవం నిర్వహించారు. గొబ్బెమ్మలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. గొబ్బెమ్మలను లక్ష్మీస్వరూపం, గోపిక స్వరూపంగా పూజిస్తామని, శ్రీకృష్ణుడు గోపికలను కరుణించినట్లు ప్రజలకు అభయహస్తం ఇస్తారని నిర్వాహకురాలు అన్నారు. ప్రతి ఏడాది ధనుర్మాసంలో దేవస్థానాలు, పాఠశాలల్లో పండుగ జరుపుతున్నామని, భోగిపండుగ వరకు నిర్వహి స్తామని తెలిపారు. కార్యక్రమంలో సత్యవతి, సుబ్బాయమ్మ, సునీత, వయూక, కోటేశ్వరి, రాజకుమారి, పలువురు భక్తులు పాల్గొన్నారు.

'మీ గుండె పదిలం' ఆధ్వర్యంలో స్టెంట్ల అమరిక



స్టెంట్‌లు వేసిన వారిని పరామర్శిస్తున్న బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

- సీఎం జగన్ పాలన ఆదర్శంగా సేవా కార్యక్రమాలు
- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమం ఆధ్వర్యంలో నిర్వహించిన మెడికల్ క్యాంపు ద్వారా ఉచితంగా గుండెకు స్టెంట్ వేసే కార్యక్రమాన్ని చేపట్టినట్లు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ తెలిపారు. పెదకాకాని మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమంలో కార్యక్రమంలో భాగంగా 'మీ గుండె పదిలం' ద్వారా స్టెంట్ వేయించుకున్న కూచిపూడి నాగేంద్రమ్మ, గండి కోట శివయ్యలను బుధవారం బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ వ్యక్తిగతంగా కలసి పరామర్శించారు. స్టెంట్ వేయించుకున్న వారికి పండ్లు అందజేశారు. గ్రామంలో బజరంగ్ నేత్ర జ్యోతిలో భాగంగా కంటిఅద్దాలు తీసుకున్న గ్రామస్తులు, మహిళలు అంబటి మురళీకృష్ణను కలసి కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆదర్శంగా తీసుకుని బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమం ద్వారా ఉచితంగా నేత్రజ్యోతి, మీ గుండె పదిలం, వికలాంగులకు ట్రై సైకిళ్ళు, ఫిజియోథెరఫీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని మురళీకృష్ణ కోరారు.

ఆరోగ్యరక్షతో పేదల ఆరోగ్యానికి భరోసా

- జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రామాంజనేయులు



కళ్ళ జోళ్లను పంపిణీ చేస్తున్న రామాంజనేయులు

గుంటూరు రూరల్: రాష్ట్రంలోని ప్రజల ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష రక్షణగా నిలుస్తుందని జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు పేర్కొన్నారు. మండలంలోని లాలుపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలకు మెరుగైన వైద్యం అందాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచారన్నారు. ఇళ్లవద్దకే వైద్యులను పంపి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించటంతో పాటు మందులు ఉచితంగా అందించటం జరుగుతుందన్నారు. ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రతి గడపకు అందజేస్తున్నారన్నారు. ప్రజలు జగనన్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని రానున్న ఎన్నికల్లో మరోసారి ఆయనను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆదినారాయణ, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

లయోలా పాఠశాలలో అలరించిన సైన్స్ ఎగ్జిబిషన్



ప్రదర్శనలను తిలకిస్తున్న ప్రిన్సిపల్ రెవరెండ్ ఫాదర్ సురేష్‌కుమార్

గుంటూరు రూరల్: విద్యార్థుల్లోని నైపుణ్యతలను మెరుగు పరిచేందుకు ఎగ్జిబిషన్‌లు ఎంతగానో దోహదపడతాయని మాజీ శాస్త్రవేత్త డాక్టర్ కె ఎలీషామోతీకుమార్ అన్నారు. బుధవారం మండలంలోని నల్లపాడు గ్రామం లయోలా పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎగ్జిబిషన్‌లు విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుతాయన్నారు. పరిశోధనల పట్ల ఆసక్తి, ఆలోచనా శక్తిని పెంచుతాయన్నారు. కార్యక్రమంలో భాగంగా లయోలా సంస్థ ప్రారంభించి 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రతి నెల జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఇంటర్‌స్కూల్ టోర్నమెంట్స్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. క్రీడా పోటీలలో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను నల్లపాడు లయోలా పాఠశాల దక్కించుకుంది. ఎగ్జిబిషన్ నిర్వాహకులను పాఠశాల సుపీరియర్ కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ పీ ఆంథోని, ప్రిన్సిపల్ రెవరెండ్ ఫాదర్ బి సురేష్‌కుమార్‌లు అభినందించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన పరిశోధన స్టాల్స్ ఆహుతులను అలరించాయి.

ముస్లిం, మైనార్టీ ద్రోహులు టీడీపీ నేతలే



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పొన్నూరు: ముస్లిం మైనార్టీ ద్రోహులు చంద్రబాబు, ధూళిపాళ్లలేనని పొన్నూరు వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు విమర్శించారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం.ఏ.మహమ్మద్ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మైనార్టీ ఓట్ల కోసం కపట నాటకాలు చేస్తున్నారని మండిపడ్డారు. ధూళిపాళ్ల నరేంద్ర గతంలో తన అధికారమదంతో పొన్నూరులోని మైనార్టీ వర్గాలకు చెందిన కేబుల్ వ్యాపార సంస్థలపై పెత్తందారీ వ్యవస్థతో ముస్లింలను ఇబ్బందులకు గురిచేసిన విషయాన్ని ముస్లింలు మరువలేదని అన్నారు. ముస్లిం మైనార్టీలపై రౌడీషీట్లు ఓపెన్ చేసిన ఘనత ధూళిపాళ్ల నరేంద్రకే దక్కిందన్నారు. పొన్నూరులో 25 సంవత్సరాల నుంచి ఆటోనగర్ ఏర్పాటు చేస్తానని అబద్ధాలు చెబుతూ ముస్లిం మైనార్టీల ఓట్లను దండుకున్న నేత ధూళిపాళ్ల అని దుయ్యబట్టారు. సిగ్గు లేకుండా ఏ మొహం పెట్టుకొని పట్టణంలో ముస్లిం మైనారిటీలతో సమావేశం ఏర్పాటు చేశారంటూ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. చంద్రబాబు హయాంలో ముస్లింలకు ఒక్క మంత్రి పదవి అయినా ఇచ్చారా అని ప్రశ్నించారు. మాజీ కౌన్సిలర్ షేక్. షర్మిల మాట్లాడుతూ 25 ఏళ్ల టీడీపీ హయాంలో ఎంతో వెనుకబడి ఉన్న పొన్నూరును సుమారు రూ.1400 కోట్లతో అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యకే దక్కుతుందన్నారు. ముస్లింల పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీలకు సముచిత స్థానం కల్పించి పొన్నూరుకు చెందిన షేక్ సైఫుల్లాకు రాష్ట్ర మైనారిటీ సభ్యునిగా అవకాశం కల్పించారని తెలిపారు. టీడీపీ మనుగడ కోసం ప్రభుత్వంపైనా, ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యపై దుష్ప్రచారాలు చేస్తే సహించేది లేదన్నారు.సమావేశంలో అంజుమన్ అధ్యక్షులు షేక్.మామ, మైనారిటీ సెల్ పట్టణ, రూరల్, అధ్యక్షులు షౌకత్, సర్దార్, షేక్. ఫజురుల్లా, నయూం బాషా, షేక్. జానిబాష, సుభాని పాల్గొన్నారు.